ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్


పెన్‌పహాడ్ : ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులుదీరిన ఓటర్లు


అర్వపల్లిలోని పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు


తుంగతుర్తిలో ఓటేసిన జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేంధర్‌రావు

తిరుమలగిరి : నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు మధ్యాహ్నం తరువాత పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎండ వేడిమి వల్ల మధ్యాహ్నం సమయంలో పోలింగ్ కేంద్రాలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. తిరుమలగిరి మండలంలో 1692 మంది ఓటర్లు ఉండగా 1256 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 74.23 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు రమణారెడ్డి, సుధ పరిశీలించారు.

ఓటేసిన మాజీ ఎమ్మెల్యే కిషోర్..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా తిరుమలగిరిలోని 449 పోలింగ్ బూత్‌లో తుంగతుర్తి మాజీ శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్, ఆయన సతీమణి గాదరి కమలతో కలిసి ఓటు వేశారు. తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సంకెపల్లి సుధీర్‌రెడ్డి పోలింగ్ బూత్ 449లో ఓటు వేశారు.

అర్వపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జాజిరెడ్డిగూడెం మండలంలో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. అర్వపల్లిలోని పోలింగ్ కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు బారులుదీరి ఉన్నారు. అయితే ఓటింగ్ బ్యాలెట్ ప్రక్రియ కావడంతో ఆలస్యం జరిగింది. జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్–మాజీ ఎంపీపీ మనీషా, డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి అర్వపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అర్వపల్లిలో 70.19శాతం పోలింగ్

జాజిరెడ్డిగూడెం మండలంలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 70.19 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 1,302మంది ఓటర్లకు గాను 914మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 647మంది పురుషులు, 267మంది మహిళలు ఓట్లు వేశారని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. కాగా ఎన్నికల సందర్భంగా ఎస్ఐ యాకూబ్ బందోబస్తు నిర్వహించారు. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

నూతనకల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 72.21శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 1335మంది ఓటర్లకు గాను 964మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 700మంది పురుషులు, 264మంది స్త్రీలు ఉన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

పెన్‌పహాడ్ : మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగిందని సెక్టార్ అధికారి కవిత తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 2034 మంది ఓటర్లు ఉండగా 1501 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. పెన్‌పహాడ్ మండలంలో 73.09శాతం పోలింగ్ నమోదైందని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ రవీందర్ పోలింగ్ కేంద్రాల బందోబస్తును పరిశీలించారు. మండల కేంద్రంలో పోలింగ్ సరళిని మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డిలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ అధికారులు జావిండ్, మీరా, ఆర్ఐలు స్వప్న, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 1,519 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1140 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 75.05 శాతం ఓటింగ్ నమోదైంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

మండల కేంద్రంలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావులు తుంగతుర్తిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నాగారం : మండల కేంద్రంలో సోమవారం జరిగిన నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 1088 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 570 మంది పురుషులు, 235 మంది మహిళలు మొత్తం 805 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 74 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, జెడ్పీటీసీ కడియం ఇందిరాపరమేశ్వర్, ఎంపీపీ కూరం మణివెంకన్న, వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాలలు తమ స్వగ్రామమైన నాగారంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఆత్మకూర్(ఎస్) : నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీకి జరిగిన ఉప ఎన్నిక సోమవారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓట్లు 2033 ఉండగా అధికారులు మండల కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం 435లో 1050 ఓట్లకు గాను 766మంది, 436 పోలింగ్ కేంద్రంలో 1023 ఓట్లకు గాను 721 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1487 ఓట్లు నమోదుకాగ 73.14 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

చివ్వెంల : నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. మండలంలో 2522 మంది ఓటర్లకు గాను అధికారులు మూడు బూత్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో పోలింగ్ బూత్ నంబర్ 437లో 1112 మంది ఓటర్లకు గాను 791 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్ నంబర్ 438లో 713 మందికి గాను 512 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అదే విధంగా పోలింగ్ బూత్ నంబర్ 439లో 697 మందికిగాను 527 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సెంటర్‌ను సూర్యాపేట ఆర్‌డీఓ వేణుమాధవ్ సందర్శించి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ వెంకట్‌రెడ్డి బందోబస్త్ నిర్వహించారు.

మద్దిరాల : మద్దిరాల మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 1093 మంది ఓటర్లు ఉండగా 785 మంది ఓటు వేశారు.


తిరుమలగిరిలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ దంపతులు


సూర్యాపేటలో చంటిబిడ్డతో వచ్చి ఓటేసిన యువతి


తుంగతుర్తిలో ఓటేసిన సర్వోత్తమ్‌రెడ్డి


తుంగతుర్తిలో ఓటేసిన సంకినేని వరుణ్‌రావు


సూర్యాపేటలోని జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు


సూర్యాపేట జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉన్న ఓటర్లు


నూతనకల్ : ఓటేసిన తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి దంపతులు


తుంగతుర్తిలో ఓటేసేందుకు వస్తున్న దివ్యాంగుడు


ఆత్మకూరులోని పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు


సూర్యాపేటలోని జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సహాయక కేంద్రం


చివ్వెంలలో బారులుదీరిన పట్టభద్రులు


తిరుమలగిరిలో పోలింగ్ కేంద్రం వద్ద..


నూతనకల్‌లో..


పెన్‌పహాడ్ : పోలీసులకు సూచనలు చేస్తున్న సీఐ


తుంగతుర్తిలో బారులుదీరిన ఓటర్లు


నాగారంలో..

పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళి పరిశీలన

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గంలోని మండలాల్లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే మందుల సామేల్ పరిశీలించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, ఆయా మండలాల నాయకులు ఎల్సోజు నరేష్, పేరాల వీరేష్, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్ మోరపాక సత్యం, ఆకుల బుచ్చిబాబు, తొడుసు లింగయ్య, నాగం సుధాకర్‌రెడ్డి, భూరెడ్డి సంజీవరెడ్డి, దరిపెల్లి వీరన్న, ఓరుగంటి సత్యనారాయణ, దొంగరి గోవర్ధన్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్‌ను పరిశీలించిన సర్వోత్తమ్‌రెడ్డి

అర్వపల్లిలోని పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో దరూరి యోగానందచారి, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మోరపాక సత్యం తదితరులు ఉన్నారు.

చివ్వెంల : చివ్వెంల మండలంలోని పోలింగ్ సెంటర్‌ను సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ సందర్శించి, ఓటింగ్ సరళిని పరిశీలించారు.


నాగారం పోలింగ్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే సామేల్


చివ్వెంల : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


వట్టిఖమ్మంపహాడ్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2011–12 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు రవికుమార్, జంపాల అజయ్, పేర్ల నరేష్, ప్రేమ్ కుమార్, దండ నాగయ్య, కలకొండ పరశురామ్, వీరబోయిన రమేష్, తిప్పర్తి గోపి, గోగుల పృథ్వీరాజ్, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఘనంగా లింగమంతులస్వామి, సౌడమ్మ జాతర


సూర్యాపేట : టేకుమట్లలో భేరీ మోగిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి


పెన్‌పహాడ్‌లో భేరీలు కొడుతున్న యాదవులు

సూర్యాపేట : సౌడమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట మండలంలోని టేకుమట్ల గ్రామంలో సౌడమ్మ తల్లి జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పటేల్ రమేష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గట్టు శ్రీనివాస్, ఎడ్ల వీరమల్లు యాదవ్, దరావత్ వెంకన్న నాయక్, షఫీ ఉల్లా, దేవేందర్, పారుక్, యాట ఉపేందర్, ధర్మా, కరుణాకర్ రెడ్డి, మండల్ రెడ్డి వేణు గోపాల్ రెడ్డి, యాదవ సంఘ నాయకులు జాల మాణిక్యం యాదవ్, జాల జానయ్య యాదవ్, నాగయ్య యాదవ్, జాల శంకర్ యాదవ్, శ్రీను పాల్గొన్నారు.


పెన్‌పహాడ్‌లో పూజలు చేస్తున్న సర్వోత్తమ్‌రెడ్డి

పెన్‌పహాడ్ : శ్రీసౌడమ్మ–లింగమంతులస్వామి జాతర సోమవారం మండల కేంద్రంలో వైభవంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీ సౌడమ్మ, లింగమంతుల స్వామి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, అద్ది కేశవులు, శెనగాని రాంబాబు, భూక్య సందీప్ రాథోడ్, ఒగ్గు రవి, సైదులు, శివనాయక్ పాల్గొన్నారు.

గట్టికల్లు గ్రామంలో..

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని గట్టిగల్లు గ్రామంలో శ్రీలింగమంతుల స్వామి జాతర సోమవారం రెండవ రోజు ఘనంగా కొనసాగింది. జాతరలో భాగంగా భక్తులు సోమవారం బోనాలు, బలిగంపలు, బలి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

అనంతగిరి : ప్రతిఒక్క రైతు తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని వ్యవసాయ సామాజిక కార్యకర్త ఎం.గోపయ్య తెలిపారు. సోమవారం కొత్తగూడెం, గోండ్రియాల, లక్కవరం, శాంతినగర్, మొగలాయికోట, కిష్టాపురం, పాలారం, చనుపల్లి, త్రిపురవరం, వసంతాపురం, వాయిలసింగారం గ్రామాల్లో చేపట్టిన రైతు చైతన్య యాత్రలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూసారం పెరగాలంటే పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులు, జీవామృతం, ఘన జీవామృతం ఉపయోగించాలని సూచించారు. చీడ, పీడల నివారణకు నీమాస్త్రం, వేప గింజల కషాయం, వేప ఆకుల ద్రావణం, వావిలాకు ద్రావణం, తూడికాడ ద్రావణం, ఆవు మూత్రం, పేడ ద్రావణం, పుల్లటి మజ్జిగ పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మంత్రిపై విమర్శలు తగవు

హుజూర్‌నగర్ : నీతి నిజాయితీ, క్రమశిక్షణ కలిగిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు విమర్శలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకురాలు చావా కిరణ్మయి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్, బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు మంత్రి ఉత్తమ్‌పై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని అన్నారు.

క్లుప్తంగా

అందుబాటులో విత్తనాలు

చివ్వెంల : మండల కేంద్రంలో రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఎ.ఆశాకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు, భూమి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ తీసుకుని మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులో తీసుకువెళ్లాలని సూచించారు. 30 కేజీల బ్యాగుకు రూ.1,116 చెల్లించాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత


మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న కడియం పరమేశ్వర్

నాగారం : మండల కేంద్రానికి చెందిన పంతం వెంకన్న కూతురు జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామానికి చెందిన సూరారం మహేశ్వరి ఇటీవల ఆడబిడ్డకు జన్మనిచ్చి మృతి చెందింది. ఈ సందర్భంగా నాగారం గ్రామానికి చెందిన హైకోర్టు అడ్వకేట్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కడియం పరమేశ్వర్ సోమవారం మృతిరాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, కడారి సోమయ్య, మంగదుడ్ల దశరథ, చిప్పలపల్లి మల్లేష్, శ్యామ్, మధు పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ


జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐలో బీమా చెక్కులు పంపిణీ చేస్తున్న మేనేజర్ రామకృష్ణ

అర్వపల్లి : కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐ మేనేజర్ బదావత్ రామకృష్ణ కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన తొండల లచ్చయ్య, బొల్లంపల్లి గ్రామానికి చెందిన గద్దగూటి జానయ్యలు ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై)లో చేరారు. అయితే ఇటీవల వారు ప్రమాదవశాత్తు మరణించారు. దీంతో బీమా కింద రూ.2లక్షల చొప్పున మంజూరైన చెక్కులను సోమవారం మృతుల కుటుంబీకులకు బ్యాంకు సిబ్బంది అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి వైవీఆర్. సురేందర్, పీఓ అక్షయ, క్యాష్ అధికారి వెంకన్న, బ్యాంక్ సిబ్బంది రమేష్, పృథ్వీరాజ్, వెంకటేష్, సోమేష్, విజయ్, నరేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అర్వపల్లి : మండల పరిధిలోని కోడూరు గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వాసశ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కోడూరు, లోయపల్లి, కొమ్మాల, సూర్యానాయక్‌తండాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నందున ప్రజలు సహకరించాలని కోరారు.

వైభవంగా గంగమ్మ జాతర


ఆలయ కమిటీ సభ్యులతో జగదీష్‌రెడ్డి

గరిడేపల్లి : మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామంలో గంగమ్మ జాతరను యాదవులు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో వచ్చి గంగమ్మకు నైవేద్యం సమర్పించారు. కాగా, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జగదీష్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జాతర నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాలి రామకృష్ణ, పెద్ద గొల్ల కుర్ర వెంకన్న, ఎల్లబోయిన దుర్గయ్య యాదవ్, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, మాశెట్టి శ్రీహరి, పిడమర్తి అంజి, యాదవులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి

అడ్డగూడూరు : మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలానికి సంబంధించి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.